# ప్రకటన గ్రంథము 10వ అధ్యాయము

## బలిష్ఠుడైన దూత చిన్న పుస్తకము

బలిష్ఠుడైన వేరొక దూత పరలోకము నుండి దిగివచ్చుట చూచితిని. ఆయన మేఘము ధరించుకొని యుండెను, ఆయన శిరస్సు మీద మేఘధనుస్సుండెను ఆయన ముఖము సూర్యబింబమువలెను ఆయన పాదములు అగ్నిస్తంభములు వలెను ఉండెను. 2 ఆయన చేతిలో విప్పబడియున్న ఒక చిన్న పుస్తకముండెను. ఆయన తన కుడిపాదము సముద్రము మీదను ఎడమ పాదము భూమి మీదను మోపి, 3 సింహము గర్జించునట్లు గొప్ప శబ్దముతో ఆర్భటించెను. 4 ఆయన ఆర్భటించినప్పుడు ఏడు ఉరుములు వాటి వాటి శబ్దములు పలికెను. ఈ ఏడు ఉరుములు పలికినప్పుడు నేను వ్రాయబోవుచుండగా– ఏడు ఉరుములు పలికిన సంగతులకు ముద్రవేయుము, వాటిని వ్రాయవద్దని పరలోకము నుండి ఒక స్వరము పలుకుట వింటిని. 5 మరియు సముద్రము మీదను భూమి మీదను నిలిచియుండగా నేను చూచిన ఆ దూత తన కుడిచెయ్యి ఆకాశముతట్టు ఎత్తి– 6 పరలోకమును అందులో ఉన్నవాటిని, భూమిని అందులో ఉన్నవాటిని, సముద్రమును అందులో ఉన్నవాటిని సృష్టించి, యుగయుగ ములు జీవించుచున్న వానితోడు ఒట్టుపెట్టుకొని ఇక ఆలస్యముండదు గాని 7 ఏడవ దూత పలుకు దినములలో అతడు బూర ఊదబోవుచుండగా, దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్తమగునని చెప్పెను.

8 అంతట పరలోకము నుండి నేను వినిన స్వరము మరల నాతో మాటలాడుచు నీవు వెళ్లి సముద్రము మీదను భూమి మీదను నిలిచియున్న ఆ దూత చేతిలో విప్పబడియున్న ఆ చిన్న పుస్తకము తీసికొనుమని చెప్పుట వింటిని. 9 నేను ఆ దూత యొద్దకు వెళ్లి ఈ చిన్న పుస్తకము నాకిమ్మని అడుగగా– ఆయన దాని తీసికొని తినివేయుము, అది నీ కడుపుకు చేదగును గాని నీ నోటికి తేనెవలె మధురముగా ఉండునని నాతో చెప్పెను. 10 అంతట నేను ఆ చిన్న పుస్తకమును దూత చేతిలో నుండి తీసికొని దానిని తినివేసితిని అది నానోటికి తేనెవలె మధురముగా ఉండెను గాని నేను దానిని తిని వేసిన తరువాత నా కడుపుకు చేదాయెను. 11 అప్పుడు వారు– నీవు ప్రజలను గూర్చియు, జనములను గూర్చియు, ఆయా భాషలు మాట లాడు వారిని గూర్చియు, అనేక మంది రాజులను గూర్చియు మరల ప్రవచింప నగత్యమని నాతో చెప్పిరి.